క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

మునగాల : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 40 క్వింటాళ్ల మంజూరు కాగా ప్రస్తుతం 24.9 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని, గురువారం మరో 15 క్వింటాళ్లు రానున్నట్లు తెలిపారు. రైతులకు 30 కేజీల సంచికి సబ్సిడీ పోనూ రూ.1,116కి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసిన దరఖాస్తు ఫారమ్‌ను కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

నేరేడుచర్ల : పట్టణంలో వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద ఆయా క్లబ్‌ల సభ్యుల వివాహ మహోత్సవం, పుట్టినరోజుల సందర్భంగా చేపడుతున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం గుండా కోటయ్య– లింగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, ప్రముఖ వ్యాపారి గుండా సత్యనారాయణ– పద్మావతి, కుమారులు గుండా భరత్, గుండా అరవింద్‌లు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనర్సింహారావు, ప్రధాన కార్యదర్శి జూలూరు అశోక్, కోశాధికారి తాళ్లూరు శ్రీనివాస్, వనిత క్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీప్రసన్న, జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, సోమప్ప దేవాలయం మాజీ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, ఊట్కూర్ నటరాజ్, తడకమళ్ల పరమేశం, పాల్వాయి గోపాలకృష్ణ, మధు, శ్రీనివాస్, కొత్త శోభన్, నకిరేకంటి వంశీ, మహంత్‌సాయి, ప్రతిక్, శ్రీనివాస్‌చారి, పుల్లయ్య, జగన్నాథాచారి, శ్రీనివాసాచారి తదితరులున్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

హుజూర్‌నగర్ : నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూర్‌నగర్ ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్, లింగగిరి రోడ్డు, మసీద్ కాంప్లెక్స్, మిర్యాలగూడ రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించి నిషేధిత జాబితాలో ఉన్న ఉత్పత్తులను దుకాణాల్లో ఉంచవద్దన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ బలరాంరెడ్డి, రమేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గుట్కాలు విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు

నేరేడుచర్ల : పట్టణంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు విక్రయిస్తున్న మహిళపై బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల పట్టణానికి రామేశ్వరి అనే మహిళ దుకాణంలో గుట్కాలు విక్రయిస్తుందన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. రూ. 1500 విలువ గల గుట్కాలను స్వాధీనం చేసుకొని రామేశ్వరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యూనిఫాం అందజేత


యూనిఫాం అందజేస్తున్న ఏపీఎం స్వరూపరాణి

హుజూర్‌నగర్ : వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు అందించేసేందుకు ప్రభుత్వం కుట్టించిన యూనిఫామ్ (ఏకరూప దుస్తులు)ను బుధవారం ఏపీఎం స్వరూపరాణి ఎంపీడీఓ లావణ్య, ఎంఈఓ సైదానాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీ పరిమళ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన

అర్వపల్లి : తిమ్మాపురంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ యాదమ్మ పరిశీలించారు. వంద రోజుల పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కూలీల హాజరు నమోదు శాతం తెలుసుకొని వారితో మాట్లాడారు. రోజుకు రూ.300వేతనం వచ్చేలా పనులు చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీలో భాగంగా ఎస్సారెస్పీ కాల్వలు శుభ్రం చేసే పనులు గ్రామంలో ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బి.లింగయ్య, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఎత్తిపోతల నిర్వహణ

- దెబ్బతిన్న పైప్‌లైన్‌లు, కూలిన బావుల చుట్టూ నిర్మాణాలు
- అధ్వానంగా మేజర్, మైనర్ కాల్వలు
- మొరాయిస్తున్న మోటార్లు
- ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని రైతుల వేడుకోలు


దెబ్బతిన్న నడిగూడెం ఎల్‌- 34 ఎత్తిపోతల పథకం బావి చుట్టూ నిర్మించిన గోడ


నడిగూడెం వద్ద కంపచెట్లమయంగా ఎల్‌- 34 పథకం మేజర్ కాల్వ

నడిగూడెం : మండల పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఎత్తిపోతల పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఎత్తిపోతల పథకాలను 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. నాటి నుంచి కూడా సరిగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. ఆయా పథకాల పైపులైన్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎత్తిపోతల పథకాలకు అనుసంధానంగా ఉన్న మేజర్, మైనర్ కాల్వలు సైతం పలుచోట్ల పూడి, కంపచెట్లమయంగా అయ్యాయి. మోటార్లు నిత్యం మొరాయిస్తున్నాయి.

వేల ఎకరాల ఆయకట్టు..

మండలంలోని సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా నాలుగు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. నడిగూడెం వద్ద ఉన్న ఎల్‌– 34 ఎత్తిపోతల పథకం కింద నడిగూడెం, రామాపురం గ్రామాల పరిధిలో 600 ఎకరాల ఆయకట్టు ఉన్నది. నారాయణపురం వద్ద ఉన్న ఎల్‌– 35 ఎత్తిపోతల పథకం పరిధిలో నారాయణపురం, బృందావనపురం, వేణుగోపాలపురం, కరివిరాల, చెన్నకేశ్వాపురం గ్రామాల్లో 4800 ఎకరాల్లో ఆయకట్టు ఉన్నది. కాగితరామచంద్రాపురం వద్ద ఎల్‌– 36 ఎత్తిపోతల పథకం కింద కాగితరామచంద్రాపురం, వెంకట్రాంపురం గ్రామాల పరిధిలో 600 ఎకరాల ఆయకట్టు ఉన్నది. అలాగే సిరిపురం వద్ద ఆర్‌–10 ఎత్తిపోతల పథకం పరిధిలో సిరిపురం, త్రిపురవరం, శ్రీరంగాపురం గ్రామాల్లో 1200 ఎకరాల్లో ఆయకట్టు ఉన్నది. నాలుగు ఎత్తిపోతల పథకాల పరిధిలో దాదాపు 3500 మంది రైతులు నీటి సంఘాల సభ్యులుగా ఉన్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

నడిగూడెం సమీపాన ఉన్న ఎల్‌– 34 ఎత్తిపోతల పథకం బావి పూర్తిగా దెబ్బతిన్నది. అయితే పథకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని రైతులు ఆరోపిస్తున్నారు. నీటి సంఘాలు రద్దు కావడంతో ఈ పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రైతులు శిస్తు సక్రమంగా చెల్లించకపోవడంతో మరమ్మతులు చేపట్టడం ఇబ్బందికరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో మాజీ నీటి సంఘం చైర్మన్‌లే సొంత డబ్బుతో పనులు చేయిస్తున్నారు. గతంలో ఎల్‌– 35 ఎత్తిపోతల పథకం మోటార్లకు ఆ సంఘం మాజీ చైర్మన్ మండవ అంతయ్య దాదాపు లక్ష రూపాయలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించారు. నేటికీ పెట్టిన ఖర్చు నగదు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించి, చివరి భూములకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

చివరి భూములకు నీరందడం లేదు



నడిగూడెం ఎల్‌- 34 ఎత్తిపోతల పథకం మేజర్, మైనర్ కాల్వలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల పూడి, కంపచెట్లమయంగా మారాయి. దీంతో చివరి భూములకు నీరందడం లేదు. తూములకు ఉన్న షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– చారాల వెంకటాచారి, రైతు, నడిగూడెం

ప్రభుత్వమే నిర్వహించాలి



పదేళ్ల క్రితం వరకు నీటి సంఘాలు ఉన్నాయి. దీంతో నీటి సంఘాలు, చిన్న నీటి పారుదల శాఖల మధ్య సమన్వయంతో ఎత్తిపోతల పథకాలను పకడ్బందీగా నిర్వహించేవాళ్లం. నీటి సంఘాలు రద్దు అయ్యాక నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. పథకాలను గ తంలో మాదిరిగా ప్రభుత్వమే నిర్వహిస్తే బాగుంటుంది.

– మంచికంటి వెంకటరెడ్డి, ఎల్‌–36 ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్, కాగితరామచంద్రాపురం

త్వరలో మరమ్మతులు చేపడతాం

మండలంలోని పలు ఎత్తిపోతల పథకాలకు ఇప్పటికే మరమ్మతులు చేపట్టాం. నడిగూడెం సమీపాన ఉన్న ఎల్‌– 34 ఎత్తిపోతల పథకం బావిని ఉన్నతాధికారులు పరిశీలించారు. త్వరలోనే బావి చుట్టూ మరమ్మతులు చేపడతాం. రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీటినందించేందుకు కృషి చేస్తున్నాం.

– ఆనంద్‌కుమార్, డీఈ, నీటి పారుదలశాఖ, నడిగూడెం

అమీనాబాద్‌లో క్షుద్రపూజల కలకలం


పోలీస్ కళాజాతాలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్

అనంతగిరి : మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో మంగళవారం రాత్రి క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అమీనాబాద్ గ్రామానికి చెందిన బియ్యాల పద్మతో పాటు మరో ఐదుగురు వ్యక్తులతో కలిసి తన ఇంటి పక్కనే ఉన్న పదావు ఇంట్లో క్షుద్రపూజలు చేసేందుకు రంగురంగుల ముగ్గు, నిమ్మకాయలు, హోమం చేసేందుకు అగ్నిగుండం, ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. సంఘటనాస్థలంలో సుమారు ఆరు అడుగుల గుంత తవ్వి పూడ్చినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. క్షుద్రపూజలు జరుగుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు, గ్రామపెద్దలకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సారావుపేట, గుంటూరు, జగ్గయ్యపేటకు చెందిన వారు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిందితులపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

మూఢ నమ్మకాలపై అవగాహన..

అమీనాబాద్ గ్రామంలో పోలీసులు బుధవారం మూఢనమ్మకాలపై బుధవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను వీడనాడాలని సూచించారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2009- 10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం స్థానికంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు చాంప్లా, ఎస్‌ఎన్. మూర్తి, రజిని, కోటయ్య, శ్రీనివాసాచారి, పూర్వ విద్యార్థులు స్వప్న, మౌనిక, ఝాన్సీ, మనీషా, రజిత, సునిత, శృతి, నాగశ్రీ, సంధ్య, రోజా పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి

మిర్యాలగూడ : విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఏఈవో ఎండి.షఫి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాదారుల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, రశీదు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. లాట్ నంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని, బీటీ 3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని తెలిపారు. నేల భూసారం పెరగడానికి పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సబ్సిడీపై అన్నారం, మిర్యాలగూడ పీఏసీఎస్, నందిపాడు టీఎస్ సీడ్స్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

రేపు వాహనాల వేలం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు సంప్రదించాలని కోరారు.

మిర్యాలగూడవాసికి నందమూరి స్వర్ణ నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న మూసా అలీఖాన్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన నటుడు, నిర్మాత, మూసాఅలీఖాన్‌కు నందమూరి స్వర్ణనంది అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ రుద్రరాజు పద్మారాజు, జహీరాబాద్ మాతాజీ చేతుల మీదుగా మూసాఅలీఖాన్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మూసా అలీఖాన్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు స్వర్ణనంది అవార్డును అందుకోవడం చాల ఆనందంగా ఉందన్నారు.

అంతర్జాతీయ అవార్డు ప్రదానం


అవార్డుతో హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాస్టర్, ఫెయిత్ బంజార అనాథాశ్రమం నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ అంతర్జాతీయ ప్లాటినమ్ లీడర్ షిఫ్ అవార్డు దక్కింది. డికే ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫొండేషన్ వారు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తమిళనాడులోని పెరంబదూర్‌లో ఈ నెల 26న హన్యానాయక్‌కు అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. హన్యానాయక్‌కు అంతర్జాతీయ అవార్డు రావడంతో పలువురు పాస్టర్లు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- రోడ్లను కమ్మేసిన కంపచెట్లు
- ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే దారిలో మూలమలుపు వద్ద రోడ్డును కమ్మేసిన కంపచెట్లు


చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డులో ఇలా..


దూదియాతండా - జానకీనగర్ వెళ్లే రోడ్డులో..


సీతారాంపురం -నారాయణపురం వెళ్లే రోడ్డులో

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల ప్రమాదరకంగా మారాయి. రోడ్లకు ఇరుపక్కల కంపచెట్లు ఏపుగా పెరిగి దారిని కమ్మేశాయి. దీంతో మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మూలమలుపుల వద్ద సుమారుగా ఈ రెండు నెలల వ్యవధిలో 10కి పైగా ప్రమాదాలు జరిగాయి. రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్ల సమస్యలను ఆర్‌అండ్‌బీ అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చిలుకూరు నుంచి దూదియాతండాకు వెళ్లే రోడ్డు, సీతారాంపురం నుంచి నారాయణపురం రోడ్డు, చిలుకూరు నుంచి ఆర్లెగూడెం రోడ్డు, దూదియాతండా నుంచి జానకీనగర్ రోడ్డుకు ఇరపక్కల కంపచెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అదికారులు స్పందించి రోడ్డుకు ఇరు పక్కల కంపచెట్లు తొలగించాలని కోరుతున్నారు.

లింకు రోడ్డు ఆక్రమణ!


బరాఖత్‌గూడెంలో శివారులో ఇరుకుగా మారిన లింకు రోడ్డు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులోని ముక్త్యాల కాలువ నుంచి ఎకలాస్‌ఖాన్‌పేట ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు గల సమారు 3 కిలోమీటర్ల లింకు రోడ్డు రెండు పక్కల ఆక్రమణకు గురైంది. దీంతో రోడ్డు ఇరుకుగా మారడంతో ఆ దారిలో రాకపోకలు సాగించే రైతులు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును ఇరుపక్కల రైతులు ఆక్రమించుకోవడంతో పాటు రహదారిపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడడంతో ఈ దారిలో వెళ్లాలంటే నరకాన్ని తలపిస్తుందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తుంది. వర్షాకాలంలో గుంతలలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అంటున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఈ రహదారిని బాగు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ నేటికీ ఫలితం కలగలేదని ఈ ప్రాంత రైతులు తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పద్మావతి, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని రైతులు కోరుతున్నారు.

హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఫలితాలు ప్రకటిస్తాం


విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి పద్మ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ ఎరగాని శ్రీనివాస్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంఫలితాలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రకటిస్తామని జిల్లా సహకార అధికారి పద్మ తెలిపారు. బుధవారం స్థానిక పీఏసీఎస్‌లో నిర్వహించిన అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశంలో సహకార సంఘాల డైరెక్టర్లు ఓట్లు వేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్‌కు చెందిన కొందరు డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం కోరినట్లు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు వచ్చిన తరువాత ఫలితాలను వెల్లడించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మ, సీఈఓ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

పంచాయతీ ఆస్తులను పరిరక్షించాలి


బక్కమంతులగూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ యాదగిరి

మఠంపల్లి : గ్రామ పంచాయతీల ఆస్తులను పరిరక్షించాలని కోదాడ డీఎల్‌పీఓ యాదగిరి సూచించారు. బుధవారం మఠంపల్లి మండల కేంద్రంతో పాటు బక్కమంతులగూడెం, తదితర గ్రామ పంచాయతీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయా పంచాయతీల్లోని నర్సరీలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్‌లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శులు మట్టయ్య, మౌనిక తదితరులు ఉన్నారు.

వైభవంగా నారసింహుని నిత్య కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతును నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, బ్రహ్మాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో నీటి పారుదల కార్యాలయం


శిథిలావస్థలో ఉన్న నీటి పారుదల శాఖ కార్యాలయ భవనం

నడిగూడెం : మండల కేంద్రంలోని నీటి పారుదల శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. 60 ఏళ్ల కిందట నాగార్జునసాగర్ కాల్వ నిర్మాణ సమయంలో నీటి పారుదల శాఖ అధికారుల కోసం విశ్రాంత భవనంగా నిర్మించారు. కానీ గత 20 సంవత్సరాలుగా ఈ భవనాన్ని నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే ఓ వైపు కూలింది. మరో వైపు కూలే ప్రమాదం ఉన్నది. ఈ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, డీఈ, ముగ్గురు జేఈలు విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన కార్యాలయ భవనం నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.

సోషల్ ఆడిట్ నిర్వహించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో 15 ఏళ్ల పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని కోరుతూ సమాచార హక్కు సలహా, సహాయ, రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక వేత్త సరికొండ రుషికేశ్వర్‌రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీలో 15 ఏళ్ల ఆడిట్ రిపోర్ట్స్, గ్రీన్ బడ్జెట్, అసైన్డ్‌ల్యాండ్, మార్టిగేజ్ వివరాలతో ఆర్‌టీఐ పత్రాలతో కలిపి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలుముల కొండల్, దేవులపల్లి కార్తిక్‌రాజు, ఉప్పుతల మహేష్ తదితరులు ఉన్నారు.

అడివెంలలో పశువైద్య శిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు ఈ సీజన్‌లో వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి బి.అర్జున్ కోరారు. ఈ సందర్భంగా 100పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు

మిర్యాలగూడ : విత్తన దుకాణాదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఏవో సరిత హెచ్చరించారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. విత్తన ధరలు, స్టాక్ వివరాలను దుకాణం ఎదుట స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఎవరైనా నాణ్యత లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు.విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు రసీదు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు రైతులు భద్రపరుచుకోవాలని సూచించారు.


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ సరిత